ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

నస్పూర్, జూలై 10 : వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యంపై, అలాగే పారిశుధ్యం, తాగునీటిపై దృష్టిపెట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా అరికట్టేందుకు ఫాగింగ్, ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని సూచించారు. మంచినీటి బావులు, ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో వీధికుక్కల సమస్యలపై చొరవ తీసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అమ్మమాట-అంగన్‌వాడీ బాట

బెల్లంపల్లి, జూలై 19 : పట్టణంలోని 65 డిప్ ఏరియా-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కేంద్రం గదిని శుభ్రం చేసి, నేర్చుకునే మూలాలను అమర్చారు. కిచెన్ గార్డెనింగ్ తయారు చేసి, జూలై సిలబస్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కొంక పద్మావతి, ఆయా మంతెన ధనలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్, జూలై 19 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు ఇందిరానగర్‌లో అమ్మ మాట-అంగన్ వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ వీ సంతోషరాణి, ఆయా లక్ష్మి, మెప్మా ఆర్పీ మంగ, మున్సిపల్ వార్డు ఆఫీసర్ ఎస్ రాకేశ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు రజకుల భోనాల పండుగ

మంచిర్యాల అర్బన్, జూలై 19 : మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడలో గల రజకుల మడేలేశ్వర స్వామి ఆలయంలో శనివారం బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఆ సంఘం పట్టణాధ్యక్షుడు పారిపెళ్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ పోశం తెలిపారు. పట్టణంలోని 36 వార్డుల్లోని రజక మహిళలు భోనాలతో తరలిరావాలని కోరారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంఘం కోశాధికారి నస్పూరి పోశం,ఉపాధ్యక్షుడు ధర్మయ్య, నల్లూరి మల్లయ్య, సల హాదారు నేరెల్ల రమేశ్, వార్డు డైరెక్టర్లు కండె కృష్ణ, ఎదుల్ల శేఖర్, శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు మైలారం శ్రీనివాస్, నస్పూరి సతీశ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెంచికల్ పేట్, జూలై 19 : పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతనే సంపూర్ణ ఆరోగ్యమని మండల ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పెంచికల్‌పేట్ పల్లె ప్రకృతి వనం వెనుకాల శుక్రవారం ఎంపీడీవో ఆల్బర్ట్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్‌తో మొక్కలు నాటారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సతీశ్, ఈసీ జైహింద్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఫారెస్ట్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నెన్నెల, జూలై 19 : మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన పోలంపల్లి మల్లేశ్ (28) 17వ తేదీన పురుగుల మందు తాగగా, శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కొంత కాలంగా నిత్యం తాగుతూ ఏ పనీలేకుండా ఉంటున్నాడు. బుధవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. విషయాన్ని భార్య సంధ్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే గ్రామసుతల సహకారంతో మంచిర్యాల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేయాలి

- 'వన మహోత్సవం' విజయవంతం చేయాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 19 : వన మహోత్సవం కార్యక్రమ నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేసేలా అధికారులు కృషిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమానికి 53 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించినట్లు, ఇప్పటి వరకు 35 శాతం మొక్కలు నాటడం పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ నెల చివరిలోగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మొక్కలు నాటి, లక్ష్యాలను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ పనుల పరిశీలన..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో మహిళా శక్తి పథకం కింద ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్ పనులను అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌వో తుకారంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మహిళల అభ్యున్నతి కోసం చేయూత నందించే దిశగా ప్రభుత్వం మహిళా శక్తి పథకం ప్రారంభించిందని కలెక్టర్ అన్నారు. క్యాంటీన్ త్వరగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దవాఖానకు వచ్చే రోగులు, సహాయకులకు క్యాంటీన్ ఉపయోగకరంగా ఉంటుందని, నాణ్యమైన అల్పాహారం, వస్తువులు ఉండేలా చూడాలని తెలిపారు. అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ, దవాఖాన సూపరింటెండెంట్ చెన్నకేశవులు, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

గురుకుల పాఠశాల, కళాశాల సందర్శన

జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లు, సరుకుల నిల్వలు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, వార్డెన్ చంద్రకళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మందమర్రి, జూలై 19 : ప్రభుత్వం బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్న రుణమాఫీ డబ్బులను కొట్టేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నాలు చేస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. సైబర్ నేరగాళ్లు ఏదో ఒక బ్యాంక్ పేరిట వాట్సాప్ ప్రొఫైల్, పిక్చర్ బ్యాంక్ లోగోతో మొబైల్ ఫోన్‌కు ఏపీకే ఫైల్ పంపిస్తారని తెలిపారు. దీనిని రైతులు యాక్సెప్ట్ క్లిక్ చేస్తే వాట్సాప్ సైబర్ నేరగాళ్ల కట్రోల్‌లోకి వెళ్తుందని, అంతేకాకుండా ఫోన్ కాంటాక్ట్‌లో ఉన్న అన్ని మొబైల్స్‌కు, అన్ని గ్రూపులకు మెస్సేజ్‌లు వెళ్తాయని పేర్కొన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు గూగుల్‌పే, ఫోన్‌పే, యుపిఐ ద్వారా డబ్బు కాజేసే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు ఏపీకే ఫైల్స్ వస్తే ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చేయవద్దని, వాట్సాప్ పని చేయకపోతే తిరిగి ఇన్‌స్టాల్ చేసి రిపోర్ట్ చేయాలని, ఎవరైనా నేరానికి గురైనట్లయితే వెంటనే సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు.

గుంతల పూడ్చివేత

బెల్లంపల్లి, జూలై 19 : పట్టణంలోని కన్నాల బస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య సిబ్బంది కంకర, సిమెంట్ వేసి, మరమ్మతులు చేపట్టారు. ప్రధానరోడుడపై గుంతలు ఏర్పడి, వర్షపు నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి రావడంతో పనులు చేపట్టినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. బస్తీవాసులతో పాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మహిళా శక్తి'లో పాడి పరిశ్రమకు అవకాశం

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 19 : మహిళా శక్తి పథకంలో పాడి పరిశ్రమకు అవకాశం కల్పించినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూర్ (టీ) మండలాలకు చెందిన డెయిరీ లబ్ధిదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయ డెయిరీ డైరెక్టర్ మధుసూదన్, పశు వైద్యులు మురళి, స్త్రీ నిధి ఆర్ఎం శ్రీనివాస్‌తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకంలో భాగంగా డెయిరీ ఫాం కోసం పాడి పశువులను ఇతర రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి, పాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ మండలంలో పాడి పశువుల నుంచి వచ్చిన కొన్ని లీటర్ల పాలు విజయ డెయిరీకి ఇవ్వవచ్చని, 15 రోజుల్లో సంబంధిత సభ్యుల ఖాతాలో డబ్బు జమ అవుతుందని పేర్కొన్నారు. పాడి పశువుల ద్వారా అదనపు ఆదాయం కలుగుతుందని, బీమా చేయిస్తే మరింత లాభం చేకూరే అవకాశం ఉంటుందన్నారు. రుణంపొందిన లబ్ధిదారులు దుర్వినియోగం చేయకుండా ఇతర రాష్ట్రాల నుంచి పశువులను తెచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పశువుల రవాణా సమయంలో పశువుల బీమా తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, ఏపీఎంలు శ్రీనివాస్, రాజ్ కుమార్, మహిళా శక్తి ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డీఈవో, ఎంఈవో

హాజీపూర్, జూలై 19 : జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రపంచ జనాభాకు సంబంధించిన పోస్టర్ తయారీ పోటీల్లో మండలంలోని దొనబండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన జీవన్ తేజ ప్రథమ బహుమతి పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు శుక్రవారం తెలిపారు. డీఈవో, ఎంఈవో, క్వాలిటీ కోఆర్డినేటర్లు విద్యార్థికి నగదుతో పాటు సర్టిఫికెట్ అందజేసినట్లు పేర్కొన్నారు.

మహిళా సభ్యుల వనభోజనం

బెల్లంపల్లి, జూలై 19 : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి పదో వార్డు పెద్దనపల్లి విఘ్నేశ్వర గ్రామ మహిళా సమాఖ్య సంఘం సభ్యులు శుక్రవారం వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొక్కెర చంద్రశేఖర్, మహిళా సమాఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జొన్న, మక్క విత్తనాలు

కాగజ్‌నగర్, జూలై 19 : కాగజ్‌నగర్ పట్టణంలోని పశు వైద్యశాలలో సబ్సిడీపై జొన్న, మక్క విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశు వైద్యాధికారి విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువైద్య, పశు సంపర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గ్రాసం కొరత నివారించేందుకు గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ మండల పశు పోషణ రైతులు ఆధార్ కార్డు సమర్పించి విత్తానాలు పొందాలని సూచించారు.

నామినేషన్లు పంపించాలి

నస్పూర్, జూలై 19 : ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ కాంపిటేషన్‌కు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఐదు నామినేషన్ల చొప్పున పంపించాలని మంచిర్యాల డీఈవో యాదయ్య పేర్కొన్నారు. జూమ్ మీటింగ్ ద్వారా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ కాంపిటేషన్‌కు నామినేషన్లు ప్రారంభమయ్యాయన్నారు. సెప్టెంబర్ 15 చివరి తేదీ అని, ఆగస్టు 30లోపే పంపించాలని తెలిపారు. ఎంపికయ్యే ప్రతీ విద్యార్థికి రూ.10 వేలు సొంత ఖాతాలో జమ అవుతుందన్నారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

రోడ్లపైకి పశువులను వదలవద్దు

చెన్నూర్, జూలై 19 : యజమానులు తమ పశువులను చెన్నూర్ పట్టణంలో రోడ్లపై రాత్రిపూట వదల వద్దని మున్సిపాల్ కమిషనర్ గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రిపూట రోడ్లపై పశువులను వదలడం వల్ల ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రమాదాలు జగుతున్నాయని పేర్కొన్నారు. మూడురోజుల్లో యజమానులు తమ పశువులను సొంత స్థలాల్లో నియంత్రించుకోవాలని తెలిపారు. లేకోతే రోడ్లపై వదలిన పశువులను స్వాధీనం చేసుకొని, రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నోట్ బుక్స్, బ్యాగుల పంపిణీ

చెన్నూర్, జూలై 19 : చెన్నూర్ పట్టణంలోని నల్లగొండ పోచమ్మ వాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆశాజ్యోతి స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను పంపిణీ చేశారు. 600 నోట్ బుక్స్, 100 బ్యాగులను అంజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత

దండేపల్లి, జూలై 19 : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని కోరుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ దండేపల్లి శాఖ ఆధ్వర్యంలో డీటీ విజయకు శుక్రవారం వినతిపత్రం అందించారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి, తగిన నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గరికంటి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి దండేవి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు మేకల తిరుపతి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగమల్లు, రమేశ్, నాయకులు దయ్యాల మల్లేశ్, గుర్రం రమేశ్, నక్క కిషన్, సత్తన్న, పోశమ్మ, చంద్రశేఖర మల్లేశ్, మోహన్, రమేశ్ తదితరులున్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

దండేపల్లి, జూలై 19 : దండేపల్లి మండలం రెబ్బెన్‌పెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని 15 మంది నిరుపేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక జత దుస్తులు, ఫార్మెటివ్ నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మంత్రి రాజు, ప్రాజెక్టు డైరెక్టర్ షర్ఫొద్దీన్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

అన్నప్రాసన, అక్షరాభ్యాసం

మందమర్రి రూరల్, జూలై 19 : మండలంలోని మామిడి గట్టు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసన, బాలలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వర్ హాజరై, పిల్లలకు పౌష్టికాహారం, బాలింతలకు పాలు, గుడ్లు అందించారు. సీడీపీవో విజయ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు న్యాయం చేయాలి

కాసిపేట, జూలై 19 : ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం 10వేల పోస్టులను మంజూరు చేసి, ఎస్జీటీలకు న్యాయం చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు బండ శాంకరి, మండలాధ్యక్షుడు అన్నం రమణారెడ్డి డిమాండ్ చేశారు. కాసిపేట మండలంలో శుక్రవారం పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాసిపేట, ముత్యంపల్లి, లంబాడీతండా(ఎస్), ధర్మారావుపేట, దేవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, యూపీఎస్ పెద్దనపల్లి, కోనూర్, ప్రైమరీ, వెంకటాపూర్, లంబాడీతండా పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. బదిలీ అయిన తర్వాత రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, 317 జీవోలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే స్థానిక జిల్లాకు బదిలీ చేయాలనారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాంబమూర్తి, జ్యోతి, శ్రీనివాస్, మండల కార్యదర్శి పల్లె కృష్ణ గోపాల్ పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, జూలై 19 : చెన్నూర్‌తో పాటు మండలంలోని కిష్టంపేట జడ్పీహెచ్ఎస్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయనున్నట్లు, ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో చర్చించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బిల్లా తిరుపతయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార స్వామి, జోడు మధు, జిల్లా నాయకులు పుట్ట శ్రీనివాస్, వెంకటస్వామి, శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయులు సత్య నారాయణ, రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఎన్నిక

సీసీసీ నస్పూర్, జూలై 19 : సీసీసీ నస్పూర్, తీగల్‌పహాడ్ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తీగల్‌పహాడ్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గత కార్యక్రమాల సమీక్ష, ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అధ్యక్షుడిగా సీనియర్ ఆర్ఎంపీ చుంచు శంకర్‌వర్మ, ఉపాధ్యక్షుడిగా సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆడే శ్రీనివాస్, కోశాధికారిగా రాజు, గౌరవ అధ్యక్షులుగా రొడ్డ రాజేశం, రాజేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఎడ్ల శంకర్ ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికకు సహకరించిన వారందరికీ శంకర్‌వర్మ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీసీసీ నస్పూర్, తీగల్‌పహాడ్ ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

శంకర్‌వర్మ

చెక్కు అందజేత

మంచిర్యాల అర్బన్, జూలై 19 : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మంచిర్యాల యూనివర్సల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారులైన అరికోల సత్తయ్య భార్య అరికోల భాగ్యలక్ష్మికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి కింద రూ.2 లక్షల బీమా మంజూరైంది. కాగా, సంబంధిత చెక్కును శుక్రవారం బ్యాంక్ చైర్మన్ వీ వినయ్ కుమార్, సీఈవో కేపీఎస్ఎన్ మూర్తి బాధితులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులందరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న చైర్మన్ వినయ్ కుమార్

పారిశుధ్య పనులు చేపట్టాలి

లక్షెట్టిపేట, జూలై 19 : లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 9వ వార్డు ఊత్కూర్‌లో పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మురుగునీరు డ్రైనేజీల్లోకి చేరిందని, చాలా చోట్ల వర్షపునీరు నిలిచిందని పేర్కొన్నారు. రహదారిపై నడవాలంటే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అలాగే ప్రజలకు వివిధ వ్యాధులు సోకే అవకాశం ఉందని తెలిపారు. మారిశెట్టి సుమన్, దర్శనాల వంశీ, జనార్దన్, కిరణ్, రవితేజ, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

చెక్కు అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 19 : జిల్లాలోని ఈజ్‌గాం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ దయానంద్ ఇటీవల మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం రూ.8 లక్షల విలువగల భద్రతా చెక్కును ఎస్పీ డీవీ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబానికి అండగా ఉంటామని, పోలీస్ శాఖ తరపున అన్ని రకాల ప్రతి ఫలాలు అందేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య పాల్గొన్నారు.

బ్యాంకుల్లో కిటకిట

దండేపల్లి, జూలై 19 : తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ నిధులు విడుదల చేయడంతో శుక్రవారం బ్యాంకుల వద్ద రైతుల సందడి కనిపించింది. దండేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, మేదరిపేటలోని యూనియన్ బ్యాంక్ వద్ద రైతులు వివరాలు తెలుసుకునేందుకు బారులు తీరారు. రుణమాఫీ కానీ వారు అధికారుల వద్దకు పరుగులు తీశారు.

పెద్ద సంఖ్యలో బ్యాంక్‌కు వచ్చిన రైతులు

దుకాణాల్లో అధికారుల తనిఖీలు

లక్షెట్టిపేట, జూలై 19 : లక్షెట్టిపేట పట్టణంలోని పలు దుకాణాల్లో సేల్స్‌టాక్స్, జీఎస్టీ అధికారులు శుక్రవారం తనిఖీ చేపట్టారు. జీఎస్టీతో పాటు, ఇతర పన్నులపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ ప్రొఫెషనల్ టాక్స్ వసూలు చేశారు. ఈ సందర్భంగా ఏసీటీవో సంగీత మాట్లాడుతూ.. రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల లోపు వ్యాపారం చేస్తున్న దుకాణాదారులు యేటా పీటీ సుమారు రూ.1250 చెల్లించాల్సి ఉంటుందని, అలాగే రూ.50 లక్షలకు పైగా వ్యాపారం చేస్తున్న దుకాణాదారులు యేటా రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పన్ను నేరుగా ఆఫీలో గానీ, ఆన్‌లైన్‌లో గానీ చెల్లించేందుకు వీలు ఉంటుందని తెలిపారు. మొదటిసారి ఆన్‌లైన్‌లో పొందుపర్చిన వ్యాపారుల వివరాలను యేటేటా ఆన్‌లైన్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూతప్పకుండా పన్ను కట్టాలని సూచించారు. ఏసీటీవో వెంట జూనియర్ అసిస్టెంట్ మోబీన్